క్లుప్తంగా

మంజూరైన నిధులను ఆపొద్దు

చిల్పూరు: స్వగ్రామాభివృద్ధి కోసం దివంగత జెడ్పీ చైర్మన్ పాగాల సంపత్‌రెడ్డి సీసీ రోడ్ల కోసం మంజూరు చేసిన నిధులను ఆపకుండా మంజూరు చేయాలని ఎంపీటీసీ మారేపల్లి లలితశ్యాంకుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని రాజవరంలో శుక్రవారం ఆమె మాట్లాడుతూ సంపత్‌రెడ్డి రాజకీయాలకతీతంగా గ్రామంలో అన్ని వార్డులకు సీసీ రోడ్లు మంజూరు చేయగా కేవలం మూడు రోడ్లకు నిధులు మంజూరై ఉన్నప్పటికీ ఎమ్మెల్యే ఎన్నికల కోడ్‌తో నిలిచి పోయాయి. ఇటీవల పనులు పూర్తి చేసేందుకు ప్రయత్నించగా నూతన జెడ్పీ చైర్మన్, సీఈఓ సీసీ రోడ్ల నిధులను వెనక్కి తీసుకున్నట్లు అధికారులు తెలిపారన్నారు. సీసీ రోడ్ల నిధులను ఆపకుండా పనులు పూర్తయ్యేలా సహకరించాలని కోరారు.

సీఎంను కలిసిన ఫౌండేషన్ చైర్మన్



బచ్చన్నపేట : మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి డాక్టర్ మోహన్ యాదవ్‌ను వాస్విక్ ఫౌండేషన్ చైర్మన్ నిడిగొండ నరేష్‌కుమార్ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లో కలిసి శాలువాలతో సీఎంను సన్మానించారు. అనంతరం నరేష్‌కుమార్ మాట్లాడుతూ ఫౌండేషన్ ద్వారా చేస్తున్న పలు సేవా కార్యక్రమాల గురించి వారికి వివరించామన్నారు. ఫౌండేషన్ సేవా కార్యక్రమాలకు తన వంతు సహాయ, సహకారాలు ఉంటాయని తెలిపారని అన్నారు. కలిసిన వారిలో డేషన్ వైస్ చైర్మన్ నూకల భాస్కర్‌రెడ్డి, నాయకులు మురళీధర్‌రావు, మహేందర్‌వర్మ, నవనీత్ సింగ్, హేమంత్ పలువురు ఉన్నారు.

ఎల్‌ఓసీ అందజేత

చిల్పూరు: మండలంలోని మల్కాపూర్ గ్రామానికి చెందిన నామాల సరిత అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి సరిత భర్త రవికి రూ.1.50 లక్షల విలువైన ఎల్‌ఓసీని శుక్రవారం అందజేశారు.

జీపీ సిబ్బంది సేవలు వెలకట్టలేనివి

బచ్చన్నపేట : గ్రామాల్లో గ్రామ పంచాయతీ సిబ్బంది సేవలు వెలకట్టలేనివని బండనాగారం స్పెషలాఫీసర్ శ్రీనివాస్‌రావు అన్నారు. శుక్రవారం జీపీ కార్యాలయంలో గ్రామ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో అందరూ తమ ఇంటి చుట్టు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. అనంతరం గ్రామ పంచాయతీ సిబ్బందికి సన్మానం చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి భరత్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయంలో గోపూజ



రఘునాథపల్లి: మండల కేంద్రంలోని శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో శుక్రవారం అత్యంత భక్తి శ్రద్ధలతో గోపూజ నిర్వహించారు. ముందుగా వేద పండితులు సతీష్ మంత్రోచ్ఛరణాలతో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో గంధ వీరయ్య-శ్రీదేవి, రాజలింగం తదితరులు పాల్గొన్నారు.

గ్రామ కమిటీల ఎన్నిక

బచ్చన్నపేట : మండలంలోని పోచన్నపేట, తమ్మడపల్లి గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీలను శుక్రవారం ఎన్నుకున్నారు. గ్రామ శాఖ అధ్యక్షులుగా ఆకిరెడ్డి శ్రీధర్, దాసరి శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శులుగా పయ్యావుల రాజు, అవదూత ఉమేష్, యూత్ అధ్యక్షులుగా దొమ్మాట చందు, ప్రధాన కార్యదర్శి మోత్కూరి మహేష్, మహిళా అధ్యక్షురాలు పిల్లి సువర్ణ, ప్రధాన కార్యదర్శి కంసాని మౌనికతో కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ చింతపండు రాణి, నాయకులు మేకల రాజు, బాలరాజు, శివరాములు, ఉపేందర్‌రెడ్డి, పాల్గొన్నారు. కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సంస్మరణ సభను విజయవంతం చేయండి

పాలకుర్తి టౌన్: మూఢనమ్మకాల నిర్మూలనకు వ్యతిరేకంగా జీవితమంతా పోరాడిన దీశాలి జయగోపాల్ సంస్మరణ సభను విజయవంతం చేయాలని బహుజన కులాల ఐక్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు గుమ్మడిరాజుల సాంబయ్య కోరారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ ఈనెల 18న వరంగల్ లో జయగోపాల్ సంస్మరణ సభకు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవతం చేయాలని కోరారు.

కేంద్రంలో బీజేపీని గద్దె దించాలి

● మాజీ ఎమ్మెల్యే సీహెచ్.రాజారెడ్డి

జనగామ రూరల్: కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం గద్దె దిగితేనే కార్మికుల హక్కులు సాధించబడుతాయని మాజీ ఎమ్మెల్యే సీహెచ్.రాజారెడ్డి అన్నారు. శుక్రవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో పట్టణంలో దేశవ్యాప్త బంద్‌లో భాగంగా హమాలీ కార్మిక సంఘం కార్యాలయం నుంచి జనగామ చౌరస్తా వరకు కార్మికులతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ సంపదను దేశంలో బడా పెట్టుబడి దారులకు దోచిపెడుతున్నారని విమర్శించారు. పేదలు మరింత పేదవారుగా మారుతున్నారని నిత్యావసర సరకులు కొనుగోలు చేసే పరిస్థితి లేదన్నారు. రైతులు పంటల కొనుగోలుకు మద్దతు ధర ఇవ్వాలని పోరాటం చేస్తుంటే కేంద్రం అణచివేస్తుందని తక్షణం వారి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో శ్రీనివాస్, జనార్దన్, సో మయ్య, శ్రీశైలం, యాకూబ్, మల్లయ్య,రాజు పాల్గొన్నారు.



జనగామ రూరల్ : జనగామ చౌరస్తాలో నిరసన చేస్తున్న నాయకులు



స్టేషన్‌ఘన్‌పూర్: ర్యాలీ చేస్తున్న సీపీఎం, సీఐటీయూ నాయకులు, కార్మికులు



దేవరుప్పల : జనగామ-సూర్యాపేట రహదారిపై కార్మిక సంఘాల రాస్తారోకో



పాలకుర్తిలో సమ్మె చేస్తున్న ప్రజాసంఘాల కార్యకర్తలు, నాయకులు

ప్రజావ్యతిరేక విధానాలు అవలంభిస్తున్న కేంద్రం

స్టేషన్‌ఘన్‌పూర్: కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న కేంద్ర ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాలని మత్స్య కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మునిగెల రమేష్, గౌరైలు, మేకల పెంపకందార్ల సంఘం జిల్లా కార్యదర్శి సాదం రమేష్, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి కొడెపాక యాకయ్య అన్నారు.గ్రామీణ భారత్‌బంద్‌లో భాగంగా శుక్రవారం ఘన్‌పూర్‌లో బంద్ విజయవంతమైంది. డివిజన్ కేంద్రంలో వివిధ రంగాల కార్మికులు, రైతులు, సీఐటీయూ, ఏఐకేఎస్, ఏఐఏడబ్ల్యుయూ తదితర ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ర్యాలీ చేపట్టారు.

ఆటో కార్మికుల నిరసన ర్యాలీ

ఆటో డ్రైవర్లు, కార్మికుల సమస్యల్ని పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ స్టేషన్‌ఘన్‌పూర్‌లో మండల ఆటో యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం ర్యాలీ చేపట్టారు. అనంతరం స్థానిక రైల్వేస్టేషన్ నుంచి వివేకానంద చౌరస్తా, గాంధీ చౌరస్తా మీదుగా బస్టాండ్ వరకు ఆటోల ర్యాలీ చేపట్టారు. ఆటోయూనియన్ మండల అధ్యక్షుడు గుర్రం మధుమోహన్, ప్రధాన కార్యదర్శి గజవెల్లి దయాకర్ మాట్లాడారు. కార్యక్రమంలో ఆటోయూనియన్ నాయకులు రాజారపు జయపాల్, మొగిలి, జోజి, వెంకటేష్ పాల్గొన్నారు.

శ్రామికుల జీవితాలతో చెలగాటం

దేవరుప్పుల : క్షేత్రస్థాయిలో నిరంతరం శ్రమించి కార్మికుల జీవితాలతో మోదీ సర్కారు సంస్కరణల పేరిట చెలగాటమాటేందుకు యత్నిస్తుందని రైతు సంఘం జిల్లా నాయకుడు బిల్లా తిరుపతిరెడ్డి ఆరోపించారు. శుక్రవారం కేంద్ర ప్రభుత్వ కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సీపీఐ, రైతు సంఘం, ఏఐటీయూసీ సంయుక్త ఆధ్వర్యంలో మండల వ్యాప్తంగా బంద్ చేయించి జనగామ-సూర్యాపేట రహదారిపై ర్యాలీ చేపట్టి రాస్తారోకోలో బీజేపీ ప్రభుత్వ తీరును ఎండగట్టారు. ఈ సందర్భంగా తిరుపతి రెడ్డి, సీపీఐ మండల కార్యదర్శి జీడి ఎల్లయ్య మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి జీడి ఎల్లయ్య, బెజగం ఎల్లయ్య, ఏఐటీయూసీ మండల కార్యదర్శి శ్రీను, సోమనారాయణ, పరుశరాముల, నర్సయ్య, చెన్నయ్య, శ్రీను, జన్నయ్య, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

ఐక్య పోరాటాల ద్వారానే హక్కుల సాధన

పాలకుర్తి టౌన్: మతోన్మాద బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, కర్షక ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలని వివిధ సంఘాల జిల్లా నాయకులు అన్నారు. గ్రామీణ భారత్ బంద్‌ను పురస్కరించుకుని శుక్రవారం దేశవ్యాప్త సమ్మెను పురస్కరించుకుని గుడివాడ చౌరస్తా నుంచి రాజీవ్ గాంధీ విగ్రహం వరకు ర్యాలీలు నిర్వహించారు. సమ్మెకు రెడ్ ఫ్లాగ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మాన్యపు బుజేందర్, పంచాయతి వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు బత్తిని వెంకన్న, ఏదునూరి వెంకన్న పాల్గొని మాట్లాడారు.

అసెంబ్లీలో మన ఎమ్మెల్యేలు ఏమన్నారంటే..

సైనిక్ స్కూల్‌ను తరలించొద్దు : కడియం



స్టేషన్‌ఘన్‌పూర్: ధర్మసాగర్ మండలం ఎలుకుర్తికి గత ప్రభుత్వం మంజూరు చేసిన సైనిక్ స్కూల్‌ను ఎట్టి పరిస్థితుల్లో తరలించవద్దని ఎమ్మెల్యే కడియం శ్రీహరి కోరారు. శుక్రవారం అసెంబ్లీ సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ.. స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గానికి మంజూరైన సైనిక్ స్కూల్‌ను సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లో ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం ఆలోచిస్తున్నట్లు తెలిసిందన్నారు. ఎట్టి పరిస్థితుల్లో సైనిక్ స్కూల్ తరలించొద్దని, నిర్మాణం త్వరగా చేపట్టాలని కోరారు. అలాగే మడికొండ, రాంపూర్, ధర్మసాగర్ గ్రామాల మధ్య దాదాపు 30 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న డంపింగ్ యార్డుతో భూగర్భ జలాలు కలుషితం అవుతున్నాయని, తక్షణమే యార్డును మడిపల్లి, జయగిరి మధ్య 150 ఎకరాల స్థలంలోకి మార్చాలని కోరారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వ అధికార చిహ్నం నుంచి కాకతీయుల కళాతోరణాన్ని తొలగించవద్దని విజ్ఞప్తి చేశారు.

సీటీ స్కాన్, ఎమ్మారై సేవలు అత్యవసరం : పల్లా



జనగామ: మెడికల్ కళాశాలతో అప్‌గ్రేడ్ చేసుకున్న జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో నూతనంగా సీటీ స్కాన్, ఎమ్మారై సేవలను అందుబాటులోకి తెచ్చి పేదలపై భారం తగ్గించాలని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి శుక్రవారం అసెంబ్లీలో ప్రస్తావించా రు. ప్రస్తుతం ఉన్న సీటీ స్కాన్ రిపేరుకు వచ్చిందని, దీంతో అత్యవసర సమయంలో వరంగల్ ఎంజీఎం లేదా హైదరా బాద్ గాంధీకి వెళ్లాల్సి వ స్తోందన్నారు. అలాగే నియోజకవర్గ పరిధిలోని చే ర్యాలను రెవెన్యూ డివిజన్ చేయాలని, ఇక్కడ లక్ష ఓట్లు.. 2.50లక్షల జనాభా ఉందని పేర్కొన్నారు. ని యోజకవర్గ ప్రజలు అవసరమైన పనులకు జనగామ.. రెవెన్యూ కోసం సిద్దిపేట.. వ్యవసాయ పనుల కోసం గజ్వేల్.. విద్యుత్ సమస్యపై హుస్నాబాద్‌కు వెళ్లాల్సి వస్తోందని వివరించారు. యాసంగి సీజన్‌లో వరి త దితర పంటలకు సాగు నీరు అందించి కాపాడే బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. దేవాదుల ద్వారా రిజర్వాయర్లను నింపి చెరువులు, కుంటలకు మళ్లించాలని విజ్ఞప్తి చేశారు.

మరుగుదొడ్ల నిర్మాణం పూర్తి చేసుకోవాలి



మరుగుదొడ్ల పనుల వివరాలను తెలుసుకుంటున్న సీఈఓ అనిల్‌కుమార్

చిల్పూరు: ప్రభుత్వం ద్వారా గతంలో ఇంటింటికి మంజూరైన వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసుకోవాలని ఎస్సీ కార్పొరేషన్ సీఈఓ అనిల్‌కుమార్ అన్నారు. మండలంలోని మల్కాపూర్‌లో శుక్రవారం మంజూరైన మరుగుదొడ్ల వివరాలతో పాటు నిర్మాణాలను ఆయన పరిశీలించారు. పూర్తయిన వాటికి బిల్లులు వచ్చాయా లేదా, ఎందుకు పూర్తి చేసుకోలేదని లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మరుగుదొడ్లు మంజూరైన వారు పూర్తి చేసుకునేలా చూడాలని పంచాయతీ కార్యదర్శి, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచించారు. ఆయన వెంట ఎంపీడీఓ శంకర్, ఎంపీఓ మదుసూధన్, ప్రత్యేకాధికారి విక్రమ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి పన్నీరు మదుసూధన్, ఫీల్డ్ అసిస్టెంట్ కింగర్ల మల్లేషం, రాజు ఉన్నారు.

మొబైల్ ఫోన్ల అప్పగింత



జనగామ రూరల్: గత కొన్ని రోజుల క్రితం మొబైల్‌ఫోన్లు పోగొట్టుకున్న బాధితులకు శుక్రవారం ఆ ఫోన్లను సీఐ రఘుపతిరెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఫోన్లను సీఈఐఆర్ అప్లికేషన్ ద్వా రా ట్రాప్ చేసి తిరిగి వారికి అందజేశామని తెలి పారు. ఇప్పటివరకు జనగామ పోలీస్‌స్టేషన్ పరి ధిలో 73 సెల్‌ఫోన్లు ట్రాప్ చేసి అప్పగించారని అ న్నారు. ట్రాప్‌చేసి ఫోన్లు కనిపెట్టిన కానిస్టేబుల్ సు రేష్‌ను బాధితులు ప్రత్యేకంగా అభినందించారు. ప్రజలు తమ మొబైల్ పోయిన, దొంగతనం జరిగిన వెంటనే స్టేషన్లో సంప్రదించాలని కోరారు.

ఈజీఎస్ పనులు వేగవంతం చేయాలి

● ఐసీడీఎస్ జిల్లా వెల్ఫేర్ ఆఫీసర్ జయంతి



మాట్లాడుతున్న స్పెషలాఫీసర్ జయంతి

పాలకుర్తి: ఈజీఎస్ పథకం కింద చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఐసీడీఎస్ వెల్ఫేర్ జిల్లా ప్రత్యేకాధికారి జయంతి అన్నారు. శుక్రవారం పాలకుర్తి జీపీ ఆవరణలో ఏర్పాటు చేసిన సభలో కూలీలు చేపట్టిన ఈజీఎస్ పనులకు సంబంధించి అభివృద్ధి, లోపాలను డీఆర్‌పీ రజియా వివరించారు. ఈ సందర్భంగా ఆఫీసర్ జయంతి మాట్లాడుతూ ఏకాభిప్రాయంతో కూలీలు పనులు చేయాలని, ఏమైనా ఇబ్బంది కలిగితే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈజీఎస్ ఏపీఓ మంజుల మాట్లాడుతూ అన్ని గ్రామాల్లో సభలు పూర్తి అయితే మండల సభ నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఎస్ఆర్‌పీ భద్రునాయక్, ఎంపీటీసీ కమ్మగాని పుష్పలీల నాగయ్య, జీపీ సెక్రటరీ వెంకటేశ్వర చారి, ఈజీఎస్ టీఏ కుమార్, ఎఫ్ఏ సంపతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలి

● వర్ధన్నపేట ఏసీపీ నర్సయ్య



పరీక్ష మెటీరియల్‌ను అందజేస్తున్న ఏసీపీ నర్సయ్య

జఫర్‌గఢ్: పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని వర్ధన్నపేట ఏసీపీ అంబటి నర్సయ్య కోరారు.స్థానిక సాంఘీక సంక్షేమ బాలికల పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు పరీక్షలపై అవగాహన సదస్సు శుక్రవారం నిర్వహించారు. సదస్సుకు పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సమత అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా ఏసీపీ హాజరై మాట్లాడుతూ పరీక్షలకు విద్యార్థులు ఇప్పటి నుంచే సన్నద్ధం కావాలన్నారు. పరీక్షలపై ఉన్న భయాన్ని తొలగించుకోవాలన్నారు. ప్రతి విద్యార్థి కష్టపడి చదివి పరీక్షలో జీపీఏ సాధించాలన్నారు. అనంతరం విద్యార్థులకు పరీక్ష మెటీరియల్‌ను అందజేశారు. కార్యక్రమంలో వర్ధన్నపేట సీఐ సూర్యప్రకాశ్, ఎస్సై మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

పది పరీక్షలకు సన్నద్ధం కావాలి

పదో తరగతి పరీక్షలకు విద్యార్థులు సన్నద్ధం కావాలని ఎస్సెస్సీ ఇంటర్నల్ మార్కుల మండల పరిశీలకులు మంగు జయప్రకాశ్ కోరారు. మండలంలోని హిమ్మత్‌నగర్, తమ్మడపల్లి (జి), జఫర్‌గఢ్, తిడుగు, సాంఘీక సంక్షేమ వెలుగు, మోడల్ స్కూల్ పాఠశాలలను తన టీం సభ్యులైన పెనుమాటి వెంకటేశ్వర్లు, కాసర్ల రమేష్‌బాబుతో కలిసి శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలలో ఫార్మేటివ్ అసెస్‌మెంట్ రికార్డులను పరిశీలించడంతో పాటు మూడు రకాల ప్రొఫార్మాల లో మార్కులు నమోదైనవా లేదా అనే విషయాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

సేవాలాల్ ఉత్సవ కమిటీ అధ్యక్షుడిగా సుమన్‌నాయక్



స్టేషన్‌ఘన్‌పూర్: సంత్ శ్రీ సేవాలాల్ జయంతి ఉత్సవ కమిటీ స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ అధ్యక్షుడిగా మండలంలోని జిట్టెగూడెం తండాకు చెందిన నునావత్ సుమన్‌నాయక్ ఎన్నికయ్యారు. నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన గిరిజన నాయకులు శుక్రవారం ఘన్‌పూర్‌లో ప్రత్యేకంగా సమావేశమై సేవాలాల్ జయంతి ఉత్సవ కమిటీని ఎన్నుకున్నారు.

క్లెంలో స్వయంపాలన దినోత్సవం



లింగాలఘణపురం: మండలంలోని క్లెం ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థులు ఘనంగా స్వయం పాలన దినోత్సవం నిర్వహించుకున్నారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు ఉత్సాహంగా పాఠాలు బోధించారు. డీఈఓగా ఈ శివకుమార్, ఎంఈఓగా ఎస్.అరవింద్, హెచ్‌ఎంగా బోయిని నవ్య విధులు నిర్వహించారు.

నిర్వహణను మండలంలోనే నిర్వహించాలి

బచ్చన్నపేట : మండల కేంద్రానికి మంజూరైన మహాత్మా జ్యోతిబాపూలే రెసిడెన్షియల్ గురుకుల పాఠశాల నిర్వాహణను మండలం కేంద్రంలోనే చూడాలని కాంగ్రెస్ సీనియర్ నాయకులు గంగరబోయిన మహేందర్ అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ మండలానికి 2018 సంవత్సరంలో ఎంజేపీ మంజూరు కాగా ఇక్కడ పక్కా భవనాన్ని నిర్మించడానికి అనువైన స్థలం లేకపోవడంతో ఆ పాఠశాలను జనగామలో నిర్వహిస్తున్నారని అన్నారు. పెంబర్తిలోని వీబీఐటీ కళాశాల ఆవరణలో పాఠశాలను నిర్వహిస్తున్నారని సంబంధిత అధికారులు వెంటనే బచ్చన్నపేటకు తరలించాలని కోరారు.

ముగ్గురిపై కేసు నమోదు

కొడకండ్ల : మండలంలోని లక్ష్మక్కపల్లికి చెందిన తండ నారాయణ టీవీఎస్ ఎక్సల్‌పై 4.5 లీటర్ల నాటుసారాను తరలిస్తుండగా పట్టుకొని స్వాధీనం చేసుకొన్నట్లు పాలకుర్తి ఎక్సైజ్ సీఐ సంతోష్‌రెడ్డి తెలిపారు. పట్టుబడిన వ్యక్తిని విచారించగా ఈ నాటుసారాను అమ్రుతండాకు చెందిన లునావత్ కళమ్మ, లక్ష్మక్కపల్లికి చెందిన గుండెబోయిన లక్ష్మీలకు సరఫరా చేస్తున్నట్లు తెలిపాడన్నారు. నాటుసారా, ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేసి ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

దర్దేపల్లిలో హైమాస్ట్ లైట్లు ప్రారంభం



పాలకుర్తి : మండలంలోని దర్దేపల్లి గ్రామంలో జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు ఎండీ.మదార్‌కు కేటాయించిన నిధుల నుంచి దర్దేపల్లి చౌరస్తాలో వేసిన హైమాస్ట్ లైట్లను తహసీల్దార్ వెంకటేశ్వర్లు ప్రారంభించారు. శుక్రవారం జరిగిన కార్యక్రమంలో తమ గ్రామానికి లైట్లు కేటాయింపు తీసుకొచ్చిన ఎండీ మదార్‌కు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మందవీరలక్ష్మి సోమయ్య, మాజీ సర్పంచ్ ఇమ్మడి ప్రకాశ్, పంచాయతీ కార్యదర్శి లక్ష్మణ్, ప్రజలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనలో యాదవులకు గుర్తింపు



పాలకుర్తి టౌన్: కాంగ్రెస్ పాలనలో యాదవులకు ప్రత్యేక గుర్తింపు దక్కిందని దేవస్థానం మాజీ చైర్మన్ చిలువేరు కృష్ణమూర్తి అన్నారు. శుక్రవారం స్థానిక కాంగ్రెస్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ గత బీఆర్ఎస్ పాలనతో బీసీల సంక్షేమాన్ని విస్మరించిదని అన్నారు. చట్ట సభల్లో యాదవులకు పెద్దపీట వేయాలని లక్ష్యంతో యాదవుల ముద్ద బిడ్డ అనిల్‌యాదవ్‌కు రాజ్యసభ సభ్యుడిగా ఎంపిక చేయడం అభినందనీయమన్నారు. సమావేశంలో కాంగ్రెస్ బీసీ సెల్ మండల అధ్యక్షుడు బైకాని ఐలేష్, నాయకులు పాల్గొన్నారు.

దాడి చేసిన వారిని అరెస్ట్ చేయాలి



స్టేషన్‌ఘన్‌పూర్: రంగారెడ్డి జిల్లా శంకరపల్లి మండలం జన్వాడలో చర్చి ఆవరణలో క్రైస్తవులపై దాడి చేసిన వారిని అరెస్ట్ చేసి చట్టపరంగా కఠినంగా శిక్షించాలని పాస్టర్లు డాక్టర్ ఆర్.నిర్మల్‌జ్యోతిబాబు, డాక్టర్ ఎం.బాలస్వామి అన్నారు. డివిజన్‌కేంద్రంలో మండల పాస్టర్ల ఫెలోషిప్ ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామిక దేశమైన భారతదేశంలో ఇలాంటి ఘటనలు చోటుచేసుకోవడం బాధాకరమన్నారు.

గుండెపోటుతో సామాజికవేత్త మృతి



రాములుగౌడ్ (ఫైల్)

రఘునాథపల్లి: సామాజిక వేత్త, బీసీ ఉద్యమ నేత, గౌడ కులస్తుల సంక్షేమానికి పాటుపడిన మండలంలోని ఖిలాషాపూర్‌కు చెందిన వంగ రాములుగౌడ్ (58) గుండెపోటుతో హైదరాబాద్ ప్రైవేట్ ఆస్పత్రిలో శుక్రవారం మృతి చెందాడు. సెంట్రల్ సహారా సౌత్ ఇండియా జనరల్ మేనేజర్‌గా రాములుగౌడ్ విధులు నిర్వహిస్తూనే అనేక సేవా కార్యక్రమాలు చేపట్టారు. మృతుడికి భార్య అనురాధ, కుమార్తె మానస ఉన్నారు. ఇటీవల బీసీ సంఘం నాయకులతో కలిసి బీసీ సంక్షేమ, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి జిల్లాకు పాపన్న పేరు నామకరణ, ఖిలాషాపూర్‌ను మండలం చేయాలని చేయాలని విజ్ఞప్తి చేశారు. గీత కార్మికుల కుటుంబాలకు ఆర్థికసాయం అందజేసి దాతృత్వం చాటారు. రాములుగౌడ్ మృతి పట్ల గౌడ సంఘం నాయకులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

ఫ్యాన్ల బహూకరణ

పాలకుర్తి టౌన్: మండలంలోని వల్మిడి శ్రీసీతారామచంద్రస్వామి ఆలయానికి మాజీ సర్పంచ్ వీరమల్ల సైదులు జ్ఞాపకర్థం వీరమళ్ల(జడల) వెంకన్న, రాజు శుక్రవారం రెండు టేబుల్ ఫ్యాన్లను బహూకరించారు. ఆలయ అర్చకుడు సుందచార్యులు, మాజీ ఆలయ చైర్మన్ వీరమళ్ల జైహింద్ పాల్గొన్నారు.

బీజేపీ హ్యాట్రిక్ సాధించడం ఖాయం



మాట్లాడుతున్న రాజేశ్వరరావు

స్టేషన్‌ఘన్‌పూర్: దేశంలో బీజేపీ ప్రభుత్వంలో ప్రధాని మోదీ ఆధ్వర్యంలో సుస్థిరపాలన అందుతుందని, వరుసగా మూడోసారి కేంద్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు రాజేశ్వరరావు అన్నారు. ఘన్‌పూర్‌లో అసెంబ్లీ ప్రవాస్ యోజన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. పార్టీ అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ ఐలోని అంజిరెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం పదేళ్లలో పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టిందని, గ్రామగ్రామాన పార్టీ శ్రేణులు ప్రజల్లోకి క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లాలన్నారు. రానున్న ఎంపీ ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో బీజేపీ విజయం సాధించడం ఖాయమన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల దశమంత్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర నాయకులు మురళీధర్‌రెడ్డి, బొజ్జపల్లి సుభాష్, ఇనుగాల యుగేంధర్‌రెడ్డి, గట్టు క్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న సీఐ మహేందర్‌రెడ్డి

పాలకుర్తి టౌన్: సైబర్ మోసాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని పాలకుర్తి సీఐ గట్ల మహేందర్‌రెడ్డి సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సైబర్ మోసాలపై ఎస్సై సాయి ప్రసన్నకుమార్‌తో కలిసి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ విద్యార్థులు అనుమానాస్పద మెసేజ్‌లు, ఈ మెయిల్స్‌లోని లింక్‌లపై క్లిక్ చేయవద్దని, వ్యక్తిగత బ్యాంకు ఖాతా నంబర్లు, క్రెడిట్, డెబిట్ కార్డుల వివరాలు, పిన్ నంబర్లు, సీవీవీ నంబర్లు ఎవరితోనూ పంచుకోవద్దన్నారు. అత్యవసర సమయంల్లో 100కు డయల్ చేయాలని సూచించారు. ట్రాఫిక్ నియమాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు పాయం శోభారాణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు పాటుపడాలి

దేవరుప్పుల : రాజకీయాలకీతతంగా శాంతి భద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని ఎస్సై ఎస్.చెన్నకేశవులు సూచించారు. శుక్రవారం స్టేషన్‌లో బాధ్యతలు స్వీకరించిన ఎస్సైని బీఆర్ఎస్ మండల నాయకుడు బస్వ మల్లేషమ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కొల్లూరి సోమయ్య, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి రవి, అధికార ప్రతినిధి హనుమంతు, సీనియర్ నాయకులు సోమనర్సయ్య, యాదగిరి, రఫేల్‌రెడ్డి, తిరుమలేష్, బస్వ వెంకన్న, దేవరాజు, నాయక్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సైని కలిసిన మండల నాయకులు

తరిగొప్పుల: నూతనంగా ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన అయ్యాల శ్వేతను బీఆర్ఎస్ నాయకులు, కాంగ్రెస్ మండల నాయకులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. సన్మానించిన వారిలో పింగిళి జగన్మోహన్‌రెడ్డి, దామెర ప్రభుదాస్, జొన్నగోని సుదర్శన్‌గౌడ్, యాదగిరి, లింగం, సంజీవ, సుధీర్, జుంలాల్ నాయక్, సత్తయ్య, రాజేశ్వర్‌గౌడ్, యాదగిరి, రవీందర్, ఉప్పలయ్య, రాజారాం తదితరులు ఉన్నారు.

దాడి ఘటనలో ఏడుగురిపై కేసు నమోదు

రఘునాథపల్లి: మండలంలోని వెల్ది గ్రామంలో గురువారం రాత్రి యువకుల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. ఈ ఘటనలో ముగ్గురికి గాయాలు కాగా, బాధ్యులైన ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై చాగర్ల రఘుపతి శుక్రవారం తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం ..హైదరాబాద్‌లోని బోరబండకు చెందిన బైరగోని హరిగౌడ్ మండలంలోని అశ్వరావుపల్లిలో తన స్నేహితుడి కుటుంబ సభ్యుల వివాహానికి కారులో స్నేహితులతో కలిసి వెళ్లాడు. కారులో డ్రైవర్ అనిల్‌కుమార్, స్నేహితులు ప్రసన్నకుమార్, పవన్‌యాదవ్, కన్నయ్యలు రఘునాథపల్లి నుంచి అశ్వరావుపల్లికి వెళ్తుండగా మార్గమధ్యలోని వెల్ది సమీపంలోని చెరువుగట్టు వద్ద హారన్ కొట్టగా కొందరు యువకులు ఎందుకు హారన్ కొడుతున్నావని అటకాయించి చేయి చేసుకున్నారు. అనిల్‌కుమార్ వెంటనే హరిగౌడ్‌కు సమాచారం అందించగా అతను ఎండీ రషీద్‌తో కలిసి అక్కడికి చేరుకొని ఎందుకు కొడుతున్నారని ప్రశ్నించగా వారిపై దాడి చేశారు. దాడిలో హరిగౌడ్, ప్రసన్నకుమార్, అనిల్‌కు గాయాలయ్యాయి. హరిగౌడ్ ఫిర్యాదు మేరకు కిరణ్, కూరపాటి రాజశేఖర్, రాహుల్, చైతన్య, మధు, ద్యావర రాజశేఖర్, శ్రీనివాస్‌లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.